# శుభసమయంలో మిత్రుని హెచ్చరిక

ప్రియమైన బాలకృష్ణా!

బాలకృష్ణకు పెళ్లవుతుంది, యేమయినా రాయరా అన్నాడు గోపాలశాస్త్రి నాతో. దాశరథికిమల్లే నాక్కూడా కవిత్వం వస్తే, యమకంగా నాలుగు పద్యాలు రాసిఇచ్చేవాణ్ణి. అయితే దీనిదుంప తెంచుకుని, పెట్టుబడిదారీ వ్యవస్థలో దేశసంపద యావత్తూ యేకొద్దిమంది సొత్తో అయినట్లు, కవిత్వంగూడా సమాజంలో కొద్దిమంది సొత్తయి ఊరుకుంది. ఇహ, ఆగుంట చిక్కులూ, ఆ తిరుగుళ్ళూ, తికమకలూ లేకుండా, ప్లెయిన్‌గా అసలు పెండ్లంటే యేమిటో టూకీగా రాద్దామనుకున్నా.

నీకు పెండ్లని శాస్త్రి చెప్పాడు. తరవాత నువు గూడా చెప్పావులే నేనేమయినా అనుకుంటానేమోనని. నువు చెప్పకపోయినా తెలియకుండా ఉంటుందా! ఇదో అందరికీ తెలిసిన హాస్యం లాంటిది. సరేగాని, ఆ చెప్పేప్పుడు, ఇంతా తెలిసిన మనిషివి, నువ్వేదో సిగ్గుపడ్డావు. నీకు తెలియకుండానే ఓ రహస్య సంతోషావేశం నీ హృదయంలో ప్రవేశించడం గమనించాను. పెండ్లంటే, పెళ్ళి చేసుకునే వాడికీ, అతని బంధుమిత్రాదులకూ సంతోషం కలగడం అనేది సహజమైన సంగతే. మానవుడి జీవితంలో పెండ్లికిమించిన మరో ఉత్సవం లేదన్నారందుకనే. అయితే సిగ్గుపడ్డం ఎందుకో అర్థంగాకుండా ఉంది. విశేషించి, పెండ్లి సమయంలోనే, ప్రతిఒక్కడూ కొద్దో గొప్పో సిగ్గు పడుతూనే ఉంటాడు. ఎందుకు సిగ్గుపడాలి? ఇదో పెద్దసమస్య. సిగ్గన్నది మానవుడి పుట్టుకతో వచ్చిందిగాదనీ, సమాజ పరిణామదశలో మానవుడే దాన్ని తెచ్చిపెట్టుకున్నాడనీ మన తత్వవేత్తలు చెబుతారు. బహుశా అది మానవుడు లైంగికంగా విజ్ఞానం పొందుతున్నప్పుడే వచ్చి ఉండవచ్చు. కారణమేమంటే, సిగ్గు తెలియని అనాగరిక జాతులు నేటికీ ఉన్నాయని ప్రతీతి. ఇహ ఆసిగ్గు ఒక్క పెండ్లి సందర్భాల్లోనే గాక, ఇతరత్రాగూడా తరచు వస్తూనే ఉంటుంది.

మానవుడి జీవితంలో పెండ్లికి మించిన ఉత్సవం మరొకటి లేదన్నాం. అవును నిజంగానే. సమాజ చరిత్రను పరిశీలిస్తే, సమాజంలో పెండ్లి అనేది అమల్లోకి వచ్చింది లగాయతూ నేటివరకూ, చివరకు వట్టి అనాగరిక జాతుల్లో గూడా, ఆసమయంలో బ్రహ్మాండమైన ఉత్సవాలూ, వింతలూ, వినోదాలూ, విందులూ చేయపడుతూండడం చూస్తాం. ఎంతటి బీద కుటుంబంలోనైనా సరే పెండ్లినాడు, వాళ్ళకున్న దాంట్లోనే ఉత్తమంగా తిని, కట్టి, అట్లాగే బంధుమిత్రాదులను సంతృప్తి పరుస్తుంటారు. ఇహ శ్రీమంతులు పెండ్లి సమయంలో ఒక్క లైట్లకుపెట్టే ఖర్చుతో నాలుగు బీదవాళ్ళ పెళ్ళిళ్లు చేయొచ్చంటాడు శాస్త్రి. ఈ హడావుడి, ఈ హంగామా అంతా అనవసరం అని తలపోసి, పెండ్లి బహు నిరాడంబరంగా జరిగితే మంచిదని అంటున్నారు సమాజ సంస్కర్తలు. చాలా పెళ్ళిళ్లు ఇప్పుడు అట్లా జరుగుతున్నాయి కూడాను.

ఇవ్విధ సమధికానందోత్సాహ సంరంభంతో కూడుకొన్న యీ పెండ్లంటే ఏమిటో తెలుసుకోవడం ముఖ్య మనుకుంటాను. పెండ్లంటే బంతులాట ముచ్చట్లూ, తలంబ్రాల సంబరం అంటూ చమత్కరించాడు శాస్త్రి ఒకసారి. ఒకప్పుడు ఓమిత్రుణ్ణి అడిగాను పెండ్లంటే యేమిటని. పెండ్లయింతర్వాత గట్టిగా నీకే తెలుస్తుంది పోరా అన్నా డాయన. పెండ్లయింతర్వాత గట్టిగా ఆలోచించాను. తేలిన విషయం యేమంటే: పెళ్ళంటే, ఓ ఆడపిల్లను మాట్లాడుకోవడం, ఆ పిల్లను ఊళ్ళో పదిమంది ముందూ పెళ్ళాం అనిపించుకోడాని కేదో తతంగం జరపడం, తరవాత ఆమెద్వారా

తోట వెంకటాద్రి

ఇష్టమున్నా లేకపోయినా సరే పిల్లల్నుకనడం, వాళ్ళను పోషించడానికి చచ్చేట్టు యేదో ఉద్యోగం చేయడం-ఇంతేనా యింకేమయినా ఉందా? కొంచెం పైకెళ్లి చూద్దాం. ప్రజోత్పత్తి నొనరించేది పెళ్ళన్నారు కాళిదాసు గారు. శాశ్వతమైన సహధర్మ చరత్వాని కదొక బాండు అని వచించారు షేక్స్పియరు గారు. పెండ్లనేది మత సంబంధమైన కార్యమని, సంభోగాది విషయాల్లో భార్యా భర్తల మీద అదొకలాంటి క్రమశిక్షణ విధిస్తుందనీ చెప్పారు గాంధీగారు.

ఇంకో ఘటికుడు 'లీగలైజుడు అండు మొనాపలైజుడు ప్రాస్టిట్యూషన్' గా వర్ణించాడు పెండ్లిని. ఈవిధంగా పలువురు పలు విధాలుగా యీ పెండ్లిని గూర్చి తమతమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. ఇహ మనం వారి కవిత్వానికి మన పైత్యాన్నిగూడా చేర్చి కొద్దిగా పరిశీలిద్దాం యీ విషయాన్ని.

పెండ్లికి మూలం సంభోగం. ఆదిమ సమాజంలో స్త్రీ పురుషులు విచక్షణారహితంగా వావివరుసలు లేకుండా, 'సిగ్గు' లేకుండా చరించేవారని సమాజశాస్త్రం చెబుతుంది. ఒక పురుషుడికి, అనేకమంది భార్యలుండడం, ఒక స్త్రీకి అనేకమంది భర్తలుండడం మన రామాయణ భాగవతాది గ్రంథాల్లోనూ, తదితరమైన యితిహాసాల్లోనూ చదువుతున్నాం.

రానురాను, అంటే క్రమక్రమంగా, మానవుడి విజ్ఞానం అభివృద్ధిచెందిన కొద్దీ, కౌటుంబిక, సామాజిక నియమాలూ, కట్టుబాట్లూ ఎక్కువై ఆదిమ సమాజంలోని గందరగోళాలూ, బహుభార్యాత్వం, బహుభర్తృత్వం, అంతరించి నేటి సభ్యతా సమాజంలోకి ఏక పత్నీత్వంగానూ, ఏక భర్తృత్వంగానూ పరిణామం చెందింది ఈ పెండ్లి. ఇప్పటికీ కొన్ని అనాగరిక జాతుల్లో చాలా గందరగోళాలున్నై. ఇదంతా ఉడకేస్తే కిందికి దిగిన సారాంశం ఏమిటయ్యా అంటే: స్త్రీ పురుషులు విచ్చలవిడిగా చరించకుండా, సత్సంతానోత్పత్తికి దారితీసే సామాజికమైన ఒక కట్టుబాటు ఈ పెండ్లి. అందుకనే కాళిదాసు, బెర్నార్డుషా ఆదులు, పెండ్లి ప్రజోత్పత్తి చేస్తుంది కాని వ్యభిచారంవల్ల ఆ పని కాదనీ, అథవా అయినా జాతి నిర్వీర్యం అవుతుందనీ అంటున్నారు. అయితే వచ్చిన చిక్కేమిటంటే: సమాజమే మంచి చెడ్డా ఆలోచించి మీ రిరువురూ నేటినుంచి భార్యా భర్తలని స్త్రీ పురుషులని ఏర్పరచి, శాసిస్తుందా, లేక స్త్రీ పురుషులే ఒకరినొకరు ప్రేమించుకొని, ఇహ మే మిరువురం భార్యా భర్తలుగా ఉంటాం అంటే అట్టివారిని సమాజం పరిగణిస్తుందా? ఇది ఇంకా వివాద గ్రస్తమైన సమస్య. దీన్ని ముందు తరాలవారి పరిష్కారాని కొదిలేద్దాం.

నాకు పెండ్లయింది; శాస్త్రికీ అయింది, ఇప్పుడు మరి నీక్కూడా అవుతుంది. ఇట్లా ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ, కవులూ, పండితులూ, రచయితలూ, తదితరమైన కళాకారులూ, పత్రికా సంపాదకులూ, సమాజ సంస్కర్తలూ, రాజకీయాది శాస్త్రవేత్తలూ, కాంగ్రెసువారూ, కమ్యూనిస్టులూ, సోషలిస్టులూ, ఒకరేమిటి, రాజాధిరాజు దగ్గర్నుండి రైతు కూలివరకూ, మహా పెద్ద పెట్టుబడిదారు నుండి ఫ్యాక్టరీ కార్మికుడిదాకా, దొంగలూ దొరలూ అంతా పెళ్లయినవారే, అవుతున్నవారే లేక అవబోతున్నవారే. ఎట్లాంటి దేభ్యాన్ని ప్రశ్నించినా పెండ్లి అయితేనే బాగుంటుందండీ అంటాడు. పెండ్లి మానవుడికి ఒక అవసరంగా కనపడుతుంది.

సామాజిక అవసరాలతో బాటు ప్రతి వ్యక్తికీ తీసివేయరాని వ్యక్తిగత అవసరాలు కొన్ని ఉంటాయనీ, అటువంటి సామాజిక, వ్యక్తిగత అవసరాలను తీర్చుకు నేందుకు పెండ్లి అవసరం అనీ కామ్రేడ్ స్టాలిన్ అంటున్నాడు. ఈ తీసివేయరాని వ్యక్తిగతావసరం ఎటువంటిదంటే, వాయుభక్షకులైన ఋష్యాదులు సహితం, ఏ ఒకరిద్దరో మినహాయిస్తే, అందరూ పెండ్లయినవారే. బ్రహ్మచర్యం అవలంబించేందుకు గాంధీగారికి పదేండ్లుపట్టిందనీ, స్త్రీవాంఛ కలిగినప్పుడు, వివేకనందస్వామి గోడకు తలకాయను అమాంతంగా కొట్టుకొని, ఆ నొప్పిలో తన ఉద్రేకాన్ని మరిచిపోయేవాడనీ వింటున్నాం. అందుకనే "యెట్టిదిగానీ ఉండవలె నరున కొక్కటి" అంటూ కవి చౌడప్ప ఖండితంగా

చెబుతున్నాడు. ఈ వ్యక్తిగత అవసరంలోనే సామాజిక అవసరం గూడా యిమిడిఉంది. వ్యక్తిగతంగా మానవ సహజ వాంఛల్ని తీర్చుకోవడం, తద్వారా సంతానోత్పత్తిచేసి సామాజికావసరం తీర్చడం. కాబట్టి అటివంటి వ్యక్తిగత అవసరాలను తీర్చుకోవడాన్ని శాసనబద్ధం చేస్తుంది యీ పెండ్లి. అందుకనే దాన్ని అంత పవిత్రంగా భావించి, పెండ్లి సమయాల్లో విందులూ, వినోదాలూ చేయడం అనుకుంటాను.

ఇహ పెండ్లయిన తర్వాత జీవితం యెట్లా ఉంటుందీ అనేది ఆలోచించ వలసిన విషయం. నాకు పెండ్లయిందండీ అని ఒక మిత్రుడికి చెబితే, "యింకేముంది కొంప నిష్కారణంగా అర్పుకొన్నావు. మెడకు గుదిబండ పడింది. చచ్చావ్ పో" అన్నాడాయన. "అసలే తొంభై పౌన్ల బరువును మోయలేక చస్తూంటే, యింకో తొంభై పౌన్లు నెత్తినీదేసుకోవడం అవుతుంది" అన్నాడు మొన్నొకసారి దాశరథి. వీరు చెప్పినదాంట్లో యెంతో సత్యం ఉంది. దేశ సంపద యావత్తూ యేకొద్దిమంది చేతుల్లోనే బిగబట్టబడి, సమానపంపకం లేకుండా నిరుద్యోగ సైన్యాన్ని సృష్టించే యీ బూర్జువా సమాజంలో, ఆర్థిక పాటవం లేనివాళ్ళకు వైవాహిక జీవితం దుర్భరంగానే ఉంటుంది. అందుకనే "సంసారం సాగరం దుఃఖం" అనీ "ఋణానుబంధరూపేణ పశుపత్ని సుతాలయః" అనేవి యెప్పుడో పుట్టుకొచ్చాయి. బహుశా అందుకనే యీ బాధ పడలేక, పూర్వకాలం కొందరు సర్వసంగ పరిత్యాగం చేసి, అడవుల కెళ్లి తపస్సు చేసుకున్నారు సౌఖ్యం కోసం. కాబట్టి వైవాహిక జీవితం సుఖప్రదం కావాలంటే, ఆరోగ్యంలోనూ, ఆర్థికంగానూ దిగులేకుండా ఉండాలి. ఈ రెంటిలో యేది లోపించినా మానసికంగా వ్యథ పడవలసి వస్తుంది. సమాజంలో ప్రతి వ్యక్తికీ తిండీ, బట్టా గ్యారంటీ ఉన్నప్పుడే, వైజ్ఞానికాభివృద్ధీ, వైవాహిక జీవితమాధుర్యం, సత్సంతానోత్పత్తీ అన్నీ లభిస్తాయి. సోషలిస్టు వ్యవస్థలో ఇవన్నీ సమకూరుతాయని సోషలిస్టులు, కమ్యూనిస్టులూ ఉద్ఘాటిస్తున్నారు.

"నాకు పెండ్లవుతుంటే యేవో నాలుగు ఆశీర్వచనాలు చదవకుండా, ఇదేదో తలకాయ నొప్పిగా రాశావే" అనొచ్చు నువ్వు. ఫరవా లేదు. ఆశీర్వచనాలు ఇవ్వడం నాకిష్టం లేదు. అవంటే నాకు నమ్మకం లేదు గూడాను. ఒకటి మాత్రం చెప్పదలచుకున్నాను. పెండ్లయిన నాటినుండి, నీ జీవితంలో ఓ మార్పు. ఓ నూతనాధ్యాయం సరికొత్త వస్తువుల్తో ప్రారంభం అవుతుంది. అనేక బాధ్యతలు తలకు చుట్టుకొంటాయి. ఇన్నిరోజుల్నుంచీ, పోర్టుఫోలియో లేని మంత్రివి, పోర్టుఫోలియో గల మంత్రివి అవుతావు. అన్ని హంగుల్ని సజ్జీకరించుకుని ప్రపంచంలో ప్రవేశిస్తావు.

నీ వైవాహిక జీవితం, ఇట్లా ఉండాలి, అట్లా ఉండాలి అని నేను సలహా ఇవ్వదలచుకోలేదు. మన ఆశయాలకూ, ఆదర్శాలకూ విరుద్ధం కాకుండా, నీకు సుఖదాయకంగానూ, సంతృప్తికరంగానూ, వుండే యే మార్గాన్నైనా అనుసరించు. మాకు కావాల్సింది కూడా అదే. అయితే ఓ చిన్న విషయం: మనం రాత్రిపూట ప్రతిరోజూ బాల్కనీలో లైటు వెలిగించే వాళ్ళం, రోడ్డుపక్కన పాడుపడిన చిన్నచిన్న గుడిసెల్లో నివసించే మానవులకోసం. మనం వెలిగించిన లైటుకాంతిలో వాళ్లు అన్నం తినే వాళ్లు. మనమేదో మహాత్యాగం చేస్తున్నట్లు గర్వించేవాళ్లం. ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే, ఆ పతితమానవులను మరిచిపోవద్దనీ, మరిచిపో గూడదనీ హెచ్చరిస్తున్నాను. నీ యీ వివాహ సమయంలో మేమంతా హృదయపూర్వకంగా కోరేది అదే. అట్లా మనం ఆ పతితులను విస్మరిస్తే, దాశరథి అగ్నిధార మనమీద కూడా కురుస్తుందేమో! ఆయన రుద్రవీణా భీకర ఝంకారవ ప్రవంతి మనవైపు గూడా మళ్ళ వచ్చు.